నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
I హైదరాబాద్, ఆదివారం 12 మే 2024 SIDDIPET

- తెలంగాణపై బీజేపీది సవతితల్లి ప్రేమ..
- ఉద్యమాన్ని గుర్తు చేసిన కేసీఆర్ రోడ్ షోలు
- పార్లమెంట్‌లో తెలంగాణ గొంతుక బీఆర్ఎస్
- రైతుల గౌరవం పెంచిన కేసీఆర్
- పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో 50 ఏండ్ల అభివృద్ధి
- ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో ఐదేండ్లు వెనక్కి..
- సిద్దిపేటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

## కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు
# ప్రజలు సిద్ధం
### ఆరు గ్యారెంటీలపై గరంగరంగా ప్రజలు

సిద్దిపేట అర్బన్, మే 11: కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల వైఫల్యంపై ప్రజలు గరంగరంగా ఉన్నారు. వారు చేసిన మోసాలపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఈ ఎన్నికలు అవకాశం కల్పించాయని, ఎన్నికల్లో రైతులు, మహిళలు, వృద్ధులు తమ ఆగ్రహాన్ని ఓట్ల రూపంలో చూపించబోతున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. శనివారం సిద్దిపేటలోని తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. రెండు నెలల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని, కేసీఆర్ నిర్వహించిన రోడ్ షోలు ఉద్యమం నాటి రోజులను గుర్తు చేశాయన్నారు. ప్రజలు కేసీఆర్ సభకు ఎండలను సైతం లెక్కచేయకుండా నీరాజనం పట్టారన్నారు. కేసీఆర్ సభలకు ప్రజల నుంచి ముఖ్యంగా మహిళలు, యువత నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ సభలు జనంలేక వెలవెలబోయాయన్నారు. సిద్దిపేటలో జరిగిన అమిత్ షా సమావేశంలో జనం లేక కేవలం 7 నిమిషాల్లోనే మాట్లాడి ముగించారన్నారు. రాహుల్ గాంధీ సరూర్‌నగర్ మీటింగ్‌లో జనంలేక స్వయంగా రేవంత్‌రెడ్డే వెళ్లి ఆహ్వానించే పరిస్థితి ఏర్పడిందన్నారు. మూడు పార్లమెంట్ల సమావేశాలు ఏర్పాటు చేస్తే రాహుల్‌గాంధీ మూడు నిమిషాల్లోనే ముగించుకొని పోయిన పరిస్థితి ఉందన్నారు. పటాన్ చెరులో కేసీఆర్ సభ పెడితే ఇసుకేస్తే రాలనంత జనం వచ్చారు. అదే స్థలంలో రేవంత్‌రెడ్డి సభ పెడితే 25శాతం మంది కూడా రాక గ్రౌండ్ అంతా ఖాళీగా ఉన్నదన్నారు.

**ఓటుతో గుణపాఠం చెప్పాలి..**

చెక్ బౌన్స్ అయితే శిక్ష పడ్డట్టు..బౌండ్ పేపర్ బౌన్స్ కావడంతో శిక్ష వేయాలని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. కేసీఆర్ తమ గురించి బలంగా కొట్లాడాలంటే కారుగుర్తుకు ఓటు వేయాలని ప్రజలు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకుల ఊకదంపుడు ఉపన్యాసాలు ప్రజలు రుచించడం లేదన్నారు. తెలంగాణ వాణి, తెలంగాణ బాణి పార్లమెంట్‌లో వినిపించాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులు గెలవాలనే భావన వినిపిస్తుందన్నారు. తెలంగాణకు ఏమీ ఇవ్వని బీజేపీకి ఓటు ఎందుకు వేయాలని ప్రజలు భావిస్తున్నారని.. మిషన్ భగీరథకు, మెడికల్ కళాశాల మంజూరు చేయడంలో, సాగు నీటి ప్రాజెక్ట్‌ల్లో, మిషన్ కాకతీయకు నిధులు అందజేయడంలో బీజేపీ సవతితల్లి ప్రేమ చూపిందన్నారు. కేసీఆర్ హయాంలో పుట్ల కొద్దీ ధాన్యం పండితే.. కాంగ్రెస్ హయాంలో పుట్టెడు కష్టాలు వచ్చాయన్నారు. అరచేతిలో వైకుంఠం చూపిన కాంగ్రెసోళ్లకు ఓటుతో గుణపాఠం చెప్పేందుకు ప్రజలంతా సిద్ధమైనట్లు హరీశ్‌రావు తెలిపారు.

**బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం..**

కాంగ్రెస్, బీజేపీలు బోగస్ సర్వేలతో బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. కానీ ప్రజల ఆదరణను ఆపలేక పోయారన్నారు. ప్రజలు కేసీఆర్‌కు అపూర్వ రీతిలో స్వాగతం పలికారని చెప్పారు. ఈ రెండు పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. ఇతర పార్టీల అభ్యర్థులు ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉన్నందున బీఆర్ఎస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం రాబోతుందని.. తెలంగాణ ప్రజలకు కచ్చితమైన గ్యారెంటీ బీఆర్ఎస్ మాత్రమేనని.. కేసీఆర్ గ్యారెంటీ తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష అన్నారు.

**కాంగ్రెస్‌తో అన్ని వర్గాలకూ అన్యాయం..**

రిజర్వేషన్లపై మాట్లాడే రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ టికెట్లలో, క్యాబినేట్ కూర్పులో ఏ రిజర్వేషన్లు అమలు చేశారో చెప్పాలన్నారు. రిజర్వేషన్ల గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు. మూడు ఎస్సీ రిజర్వ్‌డు టికెట్లలో ఒక్కరికి కూడా టికెట్ ఇవ్వలేదని.. వారికి తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్‌కు మాదిగలు బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారన్నారు. ప్రధానమైన సామాజిక వర్గాలకు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చిందని.. బీసీలకు అత్యధిక టికెట్లు ఇచ్చిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు.వెంకట్రామిరెడ్డి ఎమ్మెల్సీగా ఉండగా.. ఎంపీ టికెట్ ఎందుకు ఇచ్చారని అడుగుతున్నారని, మరీ జగిత్యాలలో ఓడిపోయిన ఎమ్మె ల్సీ జీవన్‌రెడ్డికి నిజామాబాద్‌లో ఎందుకు టికెట్ ఇచ్చారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్‌కు టికెట్ ఇస్తే ఒప్పు.. ఎమ్మెల్సీగా ఉన్న వ్యక్తికి టికెట్ ఇస్తే తప్పా అన్నారు. పూటకో మాట మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి విశ్వసనీయత కోల్పోయారన్నారు.

**ఫేక్ ప్రచారాలను ప్రజలు నమ్మవద్దు..**

మెదక్‌లో బీజేపీ అభ్యర్థి జిమ్మిక్కులు చేస్తాడని, గత దుబ్బాక ఉప ఎన్నికల్లో ఓటింగ్ ప్రారంభమయ్యే ముందు ఫేక్ వీడియోలు సృష్టించి ప్రజల్లో గందరగోళం సష్టించారని హరీ‌స్‌రావు అన్నారు. ఇప్పటికే అలాంటి వీడియోలు తయారు చేశారని, తమకు సమాచారం ఉందన్నారు. బీజేపీ, కాంగ్రెసోళ్ల సోషల్ మీడియాలో పంపించే ఫేక్ వీడియోలను ప్రజలు గుడ్డిగా నమ్మవద్దని.. ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలన్నారు. వెంకట్రామిరెడ్డి విద్యావంతుడు. 22 ఏండ్ల నుంచి ఈ జిల్లాతో అనుబంధం, అవగాహన ఉన్నదన్నారు. మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, వేణుగోపాల్‌రెడ్డి, భూపేశ్, నాయకులు ఉన్నారు.

### ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో ఐదేండ్లు వెనక్కి

మోదీ మాటల్లో నీతి, రేవంత్‌రెడ్డి ప్రవర్తనలో రీతి లేదన్నారు. రేవంత్‌రెడ్డి ఎప్పుడైనా జై తెలంగాణ అన్నారా అని ప్రశ్నించారు. అమరవీరుల స్తూపం వద్ద ఏనాడూ రెండు పువ్వులు కూడా పెట్టలేదన్నారు. జిల్లాలు రద్దు చేస్తానని. చార్మినార్, కాకతీయ తోరణం చిహ్నం నుంచి తొలిగిస్తామని మాట్లాడడం విడ్డూరమన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం పెడితే కనీసం అంబేద్కర్ జయంతి రోజు ఒక పూలదండ వేయకుండా అవమానపర్చారన్నారు. చంద్రబాబు నాయుడు తెలంగాణలో ఎకరం అమ్మితే.. ఆంధ్రప్రదేశ్‌లో పది ఎకరాలు కొనవచ్చని చెప్పాడన్నారు. కానీ కాంగ్రెస్ పాలనలో పాలన రివర్స్‌ భూముల ధరలు పడిపోయాయన్నారు. పదేండ్లలో కేసీఆర్ 50 ఏండ్ల అభివృద్ధి చూపిస్తే.. 5 నెలల్లోనే కాంగ్రెస్ 5 ఏండ్ల వెనక్కి తీసుకుపోయిందన్నారు.




# గజ్వేల్ నవ నిర్మాత కేసీఆర్
### కేసీఆర్ రాక ముందు ఎట్లుండే... కేసీఆర్ వచ్చినంక ఎట్లయింది

- గజ్వేల్ గౌరవం, ప్రతిష్టను పెంచింది కేసీఆరే...
- గజ్వేల్ రూపురేఖలు మార్చి అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపిన కేసీఆర్
- వెంకట్రామిరెడ్డి ట్రస్టు ద్వారా మీ అందరికీ ప్రయోజనం
- వెంకట్రామిరెడ్డిని భారీమెజార్టీతో గెలిపించాలి
- గజ్వేల్ రోడ్‌షోలో మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- తరలివచ్చిన గులాబీ శ్రేణులు, ప్రజలు



గజ్వేల్ రోడ్‌షోలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, చిత్రంలో బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 11: కేసీఆర్ రాకముందు గజ్వేల్ ఎట్లుండే...కేసీఆర్ వచ్చినంక ఇప్పుడెట్లుందో ప్రజలు ఆలోచన చేయాలే... గజ్వేల్ రూపురేఖలు మార్చిన కేసీఆర్‌ను గుండెల్లో పెట్టుకొని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం గజ్వేల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ..మాయమాటలు చెబుతూ కాంగ్రెస్ దేవుడి మీద ఒట్టు పెడితే...బీజేపీ మన నెత్తిమీద చేయి పెడుతుందన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలుచేస్తానని కుటుంబం మీద ఒట్టుపెట్టి ప్రజలకు మాట ఇచ్చిన వెంకట్రామిరెడ్డికే మద్దతు తెలుపాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. గెలువగానే పిల్లలకు ఉద్యోగాలు వచ్చేలా శిక్షణ ఇప్పిస్తానని, పేద విద్యార్థుల చదువుకు సాయం చేస్తానని, రూపాయికే ఫంక్షన్ హాల్, రూ.10లక్షల బీమా చేస్తానని మీ ముందుకొచ్చిన వెంకట్రామిరెడ్డిని ఆశీర్వదించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మొద్దన్నారు. తెలంగాణ ప్రదాతేకాదు... గజ్వేల్ నవ నిర్మాత కేసీఆర్ అని పేర్కొన్నారు. అప్పుడు గజ్వేల్‌లో చేసిన అభివృద్ధిని చూసి కేసీఆర్‌ను తిట్టిపోసిన ప్రతిపక్షాలు నేడు సిగ్గులేకుండా ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడగడానికొచ్చారో సమాధానం చెప్పాలన్నారు. ఈరోజు పోటీ ఎవరి మధ్య అంటే గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకున్నవాళ్లకు, గజ్వేల్ అభివృద్ధికి మోకాలు అడ్డం పెట్టినోళ్లకు, అభివృద్ధిలో గజ్వేల్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన మన కేసీఆర్‌కు మధ్య పోటీ అన్నారు. దుబ్బాకలో ఎమ్మెల్యేగా గెలిచి రూపాయి పని చేయకపోతే దౌల్తాబాద్, రాయపోల్ అక్కాచెల్లెళ్లు 54వేల ఓట్లతో బండకెసి కొట్టారని, ఇప్పుడు దుబ్బాకలో చెల్లని రూపాయి గజ్వేల్‌లో చెల్లుతాద అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ రూ.4వేల పింఛన్ ఇస్తానని మోసం చేసిందన్నారు. 5నెలలు గడిచినా పింఛన్ పెంచలేదని, ప్రతి అవ్వతాతకు రూ.10వేలు బకాయి పడ్డారన్నారు. వంద రోజుల్లో మనకు గాడిద గుడ్డు తప్పా ఏమీ ఇయ్యలేదన్నారు. మహిళలకు రూ. 2500 ఇస్తామని మోసం చేశారన్నారు. రూ. 2500 పడ్డ వాళ్లందరూ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని.. పడని వాళ్లంతా కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు.

**రివర్స్ గేర్‌లో కాంగ్రెస్ పాలన**

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన రివర్స్ గేర్‌లో నడుస్తోంది. కాంగ్రెస్ వచ్చినంక కేసీఆర్ కిట్, గజ్వేల్‌లో రూ.150కోట్ల పనులను రద్దు చేశారని ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. నిన్నటివరకు కేసీఆర్ పక్కనే ఉన్న లీడర్లు పార్టీలు మారారు. ఎక్కడ ప్రభుత్వం ఉంటదో అక్కడికి పోయారా ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు పోయారా మీరే ఆలోచన చేయాలన్నారు. ఎప్పటికైనా మనందరికీ శ్రీరామరక్ష కేసీఆర్, మనకు అన్నం పెట్టిన కేసీఆర్‌ను కాపాడుకోవాలన్నారు. ముస్లింల కోసం మసీద్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్, షాదీఖాన నిర్మించారని, క్రిస్టియన్ల కోసం క్రిస్టియన్ భవనాన్ని నిర్మించారన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు ముందుకొచ్చిన వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఆగంకాకుండా మొదటి ఈవీఎంలోనే వెంకట్రామిరెడ్డి, కారు బొమ్మ చూసి ఓటు వేయాలన్నారు. అందరం బాధ్యత తీసుకొని వెంకట్రామిరెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయిస్తామన్నారు. ఆర్అండ్ఆర్ కాలనీలో మిగిలిన పనులను పూర్తి చేసేందుకు తామంతా సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కలెక్టర్‌గా ఉన్న సమయంలో వెంకట్రామిరెడ్డికి కాలనీపై అవగాహన ఉందని, మేమంతా మీ వెంటే ఉండి సహకారం అందిస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు.

